క్లుప్తంగా

నేత్ర శస్త్ర చికిత్సలకు 24 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనిజ

నరసన్నపేట: కంటి శుక్లాలతోపాటు ఇతర సమస్యలున్న 24 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి అప్పలరాజు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చిత్తిరి వీధిలోని పెద్ద మందిరం వద్ద నిర్వహించారు. 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ శ్రీనిజ తెలిపారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మూర్తి, నాగేశ్వరరావు, చిత్తిరి ప్రసాద్, కె.ఎల్.ఎన్.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శ్యాంపిల్స్ సేకరణ



విత్తన శ్యాంపిల్స్ సేకరణను పరిశీలిస్తున్న ఏడీ రవీంద్రభారతి

సారవకోట: రైతుల నుంచి విత్తనాలు సేకరిస్తామని నరసన్నపేట వ్యవసాయ శాఖ ఏడీ రవీంద్రభారతి తెలిపారు. మండలంలోని వడ్డినవలసలో ఇద్దరు రైతుల నుంచి విత్తనాల శ్యాంపిల్స్ సేకరణ కార్యక్రమానికి గురువారం హాజరయ్యారు. సీడ్ శ్యాంపిల్స్ కోసం మండలంలో ఐదుగురు రైతులను ఎంపిక చేశామన్నారు. వారు పంట వేసిన నుంచి ధాన్యం ఇంటికొచ్చే వరకు గమనించి, వారి నుంచి విత్తనాల కోసం శ్యాంపిల్స్ సేకరిస్తామన్నారు. సేకరించిన శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఏఓ సురేష్, ఏఈఓ కంఠయ్య, రైతులు రామ్మోహన్, శ్రీరామమూర్తి ఉన్నారు.

వైద్య సేవలపై ఆరా



బాలింతకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సారవకోట: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని బుడితి సీహెచ్‌సీ వైద్యులకు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి హాజరయ్యారు. బాలింతలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ వైద్య సిబ్బంది పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రికి జనరేటర్ సౌకర్యం కల్పించాలని, రాకపోకలకు చేసేందుకు రోడ్డు కల్పించాలని ఎమ్మెల్యేను వైద్యులు కోరారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ధర్మాన తేజ్‌కుమార్, సర్పంచ్ పొన్నాన శంకరరావు, వైద్యులు సృజనీకుమారి, చైతన్య పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

హిరమండలం: తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను గురువారం కలిశారు. తంప, ధనుపురం, భగీరథపురం, గులుమూరు, మర్రిగూడ, హిరమండలం తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని కోరారు. ఏపీటీఎఫ్ తరఫున ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై పోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసారి ఎమ్మెల్సీగా ఎన్నికైతే అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. డి.ఎల్.ఎన్.నరసింహ, శాంతారం, సింహాచలం, వేణుగోపాలరావు, సింహాచలం, కోర్ను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



సరిచేసిన విద్యుత్ స్తంభం

పాతపట్నం: మండలంలోని కాపుగోపాపురం ప్రధాన వీధిలో తాగునీటి పైప్ లైన్ పనులను గురువారం మధ్యాహ్నం జేసీబీతో చేపట్టారు. ప్రమాదవశాత్తు జేసీబీ విద్యుత్ స్తంభానికి తగిలింది. స్తంభం వాలుతుండగా గ్రామస్తులు స్పందించి స్తంభానికి తాడుకట్టి సరిచేశారు. వెంటనే విద్యుత్‌ను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి పంచాయతీ ఈఓ వరప్రసాద్, సర్పంచ్ శిర్ల వేణుకుమారి, శిర్ల జోగారావు, విద్యుత్ సిబ్బంది చేరుకుని స్తంభం వద్ద కాంక్రీట్ వేయించారు. సర్పంచ్‌కు, ఈఓకు తెలియకుండా జేజేఎం పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చేపడుతున్నట్లు సమాచారం.

మెలకువలు పాటిస్తే మేలు



ధాన్యం నూర్పుడి చేపడుతున్న రైతులు

- ముమ్మరంగా వరి కోతలు
- నేటివరకు ధాన్యం కేంద్రాలను ప్రారంభించని ప్రభుత్వం
- ధాన్యం నిల్వ చేసేందుకు రైతుల అవస్థలు
- భద్రతాచర్యలు తీసుకోకపోతే నష్టపోతారని సూచిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

సరుబుజ్జిలి: ఖరీఫ్ వరి కోతలు ప్రారంభయ్యాయి. కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నేటివరకు ఎటువంటి ముందస్తు ప్రణాళికలు సిద్ధంచేయలేదు. పంట కోసిన తరవాత ఏమైనా వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోతే ధాన్యం పాడయ్యే ప్రమాదముంది. కోసిన పంట ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలుపడాల్సి వస్తోంది. ధాన్యం నష్టపోకుండా ఉండాలంటే వ్యవసాయ అధికారులు సూచించిన పలు రకాల మెలకువలు పాటించాల్సి ఉంటుంది. ఆమదాలవలస నియోజకవర్గంలో 1,02,459 ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుచేశారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో వరి పంట (ఎకరాల్లో) వివరాలు ఇలా..	
మండలం	వరి పంటసాగు
సరుబుజ్జిలి	12,245
ఆమదాలవలస	28,345
బూర్జ	27,645
పొందూరు	34,224

తేమ శాతం కట్టడి ఇలా..

వరి పంట కోత సమయంలో ధాన్యంలో 20 శాతం తేమ ఉంటుంది. పంటకోత పూర్తయిన తరువాత 3 నుంచి అంతకంటే ఎక్కువ రోజులు ఆరబెట్టడం వల్ల 4 నుంచి 6 శాతం వరకు తేమ తగ్గవచ్చు. 14 శాతం కంటే తేమ అధికంగా ఉంటే ధాన్యం బూజు పట్టవచ్చు. ధాన్యం విక్రయించే వచ్చేవరకు బయట ఉంచితే నాణ్యత తగ్గవచ్చు.

ముక్కు, పురుగు ప్రమాదం..

పంట కోయడానికి ముందే వరికి ముక్కుపురుగు నష్టం కలిగిస్తుంది. ఈ పురుగు వడ్ల గింజలో పలికి ప్రవేశించి వాటిలో గుడ్లు పెడుతుంది. లార్వా ప్రవేశించి గింజ లోపలి ఉన్న బియ్యాన్ని తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుకు..

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే చెడువాసన వస్తుంది. తల్లి కీటకం వరి గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. దీనివల్ల ధాన్యం గింజలో ఉన్న ద్రవాన్ని పీల్చి పిప్పు చేస్తుంది.

నుసిపురుగు..

నుసిపురుగును పచ్చపురుగు, పెంకుపురుగు అని కూడా పిలుస్తారు. ఇది ప్రాథమిక దశలో ధాన్యం గింజపై పొర, లోపలి గింజను తిని నాశనం చేస్తుంది. ఇలాంటి నష్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలి.

ఈ తరహా కీటకాలు వల్ల ధాన్యం నుంచి కాపాడేందుకు పలు రకాల మెలకువలు పాటించాలి.

ధాన్యం నిల్వ చేసే విధానం ఇలా..

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేయాలంటే వెదురు, సిమెంట్, లోహపు గాదెలు ఉపయోగించవచ్చు. ఎక్కువ మొత్తంలో నిల్వ చేయాలంటే గోదాములు, గిడ్డంగులు వినియోగిస్తే పూర్తి రక్షణ ఉంటుంది. ఈ నిల్వ కేంద్రాల్లో కీటకాలు, తేమ, వర్షం నీటి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజుముక్కలు, సిమెంట్‌తో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలకు కొత్త సంచులు వినియోగించాలి. సంచులపైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రేచేసి ఒకరోజు ఎండబెట్టాలి. ఈ తరహా సంచులు వాడటం వల్ల కీటకాల నుంచి ధాన్యానికి రక్షణ లభిస్తుంది.

సూచనలు పాటిస్తే ధాన్యానికి రక్షణ



శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తే ధాన్యానికి రక్షణ కలుగుతుంది. వారు సూచించిన పద్ధతులు ప్రతిఏటా పాటించడం వల్ల ఏళ్ల తరబడి ధాన్యం నిల్వ చేసినా ఎటువంటి ఇబ్బందులు ఉండవు. దీనివల్ల ధాన్యం అమ్మకాలు చేసే సమయంలో ఎటువంటి తరుగులు, నష్టాలు ఉండవు.

– పైడి దాలినాయుడు, రైతు, పురుషోత్తపురం

ధాన్యం నిల్వ పట్ల అవగాహన ఉండాలి



ధాన్యం నిల్వ చేయడంలో వ్యవసాయశాఖ అధికారులు చెప్పిన సూచనలు పాటించాలి. పంట కోత కోసిన వెంటనే ధాన్యాన్ని ఆరబెడితే తేమ శాతం తగ్గి నిల్వ చేయడానికి ఇబ్బందులు ఉండవు. ప్రతీరోజు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– బొడ్డేపల్లి పద్మనాభం, మండల వ్యవసాయాధికారి, సరుబుజ్జిలి

బకాయి వేతనాలు చెల్లించాలి



నినాదాలు చేస్తున్న ప్రభుత్వ మద్యం షాపుల్లో పని చేసిన సిబ్బంది

నరసన్నపేట: ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేసిన సేల్స్‌మెన్లు, సూపర్ వైజర్లు, నైట్‌వాచ్‌మెన్లకు బకాయిపడిన వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కొన్న శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సివిల్ సప్లయ్ గిడ్డంగుల వద్ద మద్యం షాపుల్లో పనిచేసిన సేల్స్‌మెన్లు, సూపర్‌వైజర్లు, నైటవాచ్‌మెన్లతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వం ఏపీ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రభుత్వ మద్యం షాపుల్లో పలువురిని ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాల్లో తీసుకుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మద్యం పాలసీని మార్చి వారిని వీధిన పడేసిందని ఆవేదన చెందారు. బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు బి.సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలను తప్పుబట్టారు. మా జీవితాల్లో చీకటిని మిగిల్చారన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నరసన్నపేట నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా వాసుదేవరావు, కార్యదర్శిగా టి.తిరుమలరావు, ఉపాధ్యక్షులుగా ఈ.రాజారావు, కె.రాజశేఖర్, కోశాధికారిగా బి.వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిబంధనలు తెలియజేయాలని వినతి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరుచేసిన నిర్మాణ పనులను ఎవరు చేయాలో? ప్రభుత్వ నిబంధనలు ఏమిటో తెలియజేయాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావుకు జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గురువారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని అన్ని పంచాయతీలకు ఉపాధి హామీ పథకం నిర్మాణం పనులు మంజూరయ్యాయని, ఇందుకు సంబంధించిన తీర్మానాలను సర్పంచ్ ఇచ్చారన్నారు. సర్పంచ్‌లకు రాజ్యాంగ కల్పించిన హక్కుల ప్రకారం పనులు చేసే అవకాశం ఇవ్వాలన్నారు. వెండర్ కమిటీల ద్వారా పనులు చేయాలని సంకల్పిస్తున్నట్లు తెలిసిందన్నారు. సీసీ రోడ్లపైనే మరలా రోడ్లు వేసి నిధులు స్వాహా చేయాలని కూటమి నాయకులు చూస్తున్నారని ఆరోపించారు. పనులు చేసేందుకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ పత్రాలు తమకు అందజేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, సర్పంచ్‌లు గాది కోటేశ్వరరావు, యారబాటి గణపతి, పిల్లా నర్సునాయుడు, మాజీ ఎంపీపీ శిమ్మ సాంబశివరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, నాయకులు లుకలాపు సుధీర్, రెడ్డి సీతారాం, ఈగల చిన్నారావు, కొల్ల కృష్ణ, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, తలసముద్రం శోభన్‌బాబు, కొల్ల రాము, సవర అనపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నదీ గర్భంలో ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

జలుమూరు: శ్రీముఖలింగంలోని వంశధార నదీ గర్భం ఆక్రమణలకు గురికావడంతో కార్తీక మాసంలో భక్తులకు ఇబ్బంది కలుగుతుందని గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, సర్వే అధికారులు గురువారం ఆక్రమణలను తొలగించారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించేందుకు గ్రామస్తులు సహకరించాలని అధికారులు కోరారు.

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



పాతపట్నం మండలంలోని సీది నుంచి శోద వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. మలుపుల వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

– పాతపట్నం

గోతులమయం..



ఈ చిత్రం కొత్తూరు మండలంలోని నివగాం–హడ్డుబంగి రోడ్డులో గల మాతల కాలనీ కూడలి సమీపంలోనిది. నివగాం ఇసుక రీచ్‌కు వచ్చే లారీలు అధిక లోడులతో రాకపోకలు సాగించడంతో రోడ్డు పూర్తిగా పాడైంది. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కొత్తూరు

అల్లుకున్న నిర్లక్ష్యం



సారవకోట మండలంలోని వెంకటాపురంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పంచాయతీ భవనం నిరుపయోగంగా ఉంది. ఈ భవనం పనులు అప్పటినుంచి అసంపూర్తిగా ఉండటంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలతో నిండింది. ఈ భవనం అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో ఉన్నా.. వినియోగించేందుకు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

– సారవకోట

నిరుపయోగం..



హిరమండలం మండలంలోని కిట్టాలపాడులో గల గోపాలమిత్ర భవనం నిరుపయోగంగా ఉంది. ఎనిమిదేళ్ల క్రితం సుమారు రూ.8 లక్షల నాబార్డు నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. భవనాన్ని ఒక్కరోజైనా వినియోగించలేదని స్థానిక పాడిరైతులు ఆరోపిస్తున్నారు. భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– హిరమండలం

ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆశ యూనియన్ సభ్యులు

మెళియాపుట్టి: తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ కార్యకర్తల యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని చాపర సీఐటీయూ కార్యాలయంలో జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు కె.సూరయ్య అధ్యక్షతన పలు ఆశ కార్యకర్తల యూనియన్లతో గురువారం సమావేశమయ్యారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే సెలవులను ఇప్పించాలని, రిటైర్మెంట్ కాలం పొడిగించాలని, తదితర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. వెంటనే ఆశ కార్యకర్తలకు న్యాయం జరగకపోతే సీఐటీయూతో కలిసి పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, ఆశ యూనియన్ సభ్యులు స్వర్ణలత పట్నాయక్, రోహిణి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనధికార దత్తత నేరం

జలుమూరు: పిల్లలను నిబంధనలకు లోబడి దత్తత తీసుకోవాలని వెలుగు ఏపీఎం హేమసుందరరావు అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు సిబ్బందితో గురువారం మాట్లాడారు. అనధికారంగా దత్తత తీసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, పలు చట్టాలను స్త్రీ సంక్షేమశాఖ పర్యవేక్షకులు సునీత వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై ఎమ్మెల్యే ఆగ్రహం



సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి: గ్రామ సచివాలయ ఉద్యోగులు పని తీరు వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సచివాలయం ఉద్యోగులు వేళలు పాటించడంలేదని, ఇదే పద్ధతి కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు కార్యాలయాలు కదలకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. పాతపాడులో నెయ్యిబంద చెరువు ఆక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. త్వరలో ఎండీయూ రవాణా వాహనాలు రద్దుచేస్తామని, రేషన్ డిపోలను విభజన చేస్తామన్నారు. 73 గోకుల షెడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పురుషోత్తపురం, తెలికిపెంట వద్ద రూ.3.52 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మిస్తామన్నారు. ఎంపీడీఓ పావని, మండల ప్రత్యేకాహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: మండలంలోని తామర గూడలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 29 మంది గిరిజనులకు స్థానిక ఆప్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య కంటి పరీక్షలు చేపట్టారు. ఏడుగురికి అంతర కుసుములున్నట్లు గుర్తించారు. వీరికి కంటి ఆపరేషన్లు చేస్తామన్నారు. మరో ముగ్గురికి కంటి సమస్యలు ఉన్నందున కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు. సాధారణ సమస్యలున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ కార్యకర్త వజ్రం తదితరులు పాల్గొన్నారు.

విద్యా విభాగం నోడల్ అధికారిగా గోవిందరావు



కొత్తూరు: మండల విద్యా విభాగం నోడల్ అధికారిగా కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.గోవిందరావును జిల్లా కలెక్టర్ గురువారం నియమించారు. విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్–2047కు విద్యా విభాగంలో నిర్వహించే పలు కార్యక్రమాలకు గోవిందరావు మండల నోడల్ అధికారిగా వ్యవరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాలను సరిచేశారు..



స్తంభాలను సరిచేస్తున్న విద్యుత్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

పాతపట్నం: మండలంలోని రొమదల రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లో ఒరిగిన స్తంభాలను విద్యుత్‌శాఖ అధికారులు గురువారం సరిచేశారు. గత నెల 28న పొంచి ఉన్న ప్రమాదం అనే వార్త ప్రచురితం కావడంతో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. లైన్‌మెన్ జగన్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను సరిచేశారు. రొమదల, రొంపివలస ప్రజలతోపాటు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

పంటకోత ప్రయోగాలతో మేలు



పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

బూర్జ: పంటకోత ప్రయోగం వల్ల రైతులకు మేలు చేకూరనుందని డివిజనల్ గణాంకశాఖ అధికారి వి.సుజాతకుమారి అన్నారు. మండలంలోని పీఎల్ దేవిపేటలో గురువారం గండేవలస శేషగిరిరావు వ్యవసాయ పొలంలో వరి పంట కోత ప్రయోగం చేపట్టారు. సంపద, స్వర్ణ రకాలలో 25 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 15.24 కేజీల దిగుబడి, సరాసరి ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఎన్.శ్రీనివాసరావు, మండల గణాంకశాఖ అధికారి పి.ఉషారాణి, వ్యవసాయ సహాయకులు కె.పోలరాజు, పి.సాయితేజ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీప్రసాద్

ఆమదాలవలస: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఎనర్జీ, వార్డు ఎడ్యుకేషన్, ఎమినిటీ, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, విద్యుత్ అధికారులతో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం వలన విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. దీని ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్కువ వడ్డీకి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తున్నాయన్నారు. పట్టణ ఎలక్ట్రికల్ ఏఈ జి.రామారావు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొందూరు: మండలంలోని లోలుగు ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు చేయనున్నామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

ఎల్.ఎన్.పేట: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు ఎస్.సునీత అన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో గురువారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమన్నారు. ప్లాస్టిక్ కప్పులు, బాటిళ్లు, సంచుల వినియోగం తగ్గించాలన్నారు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన వాటిలో నిల్వ ఉన్న పదార్థాలు తినవద్దని, తాగవద్దని సూచించారు. లైన్స్‌క్లబ్ సెంట్రల్ చైర్‌పర్సన్ ఎం.కె.మిశ్రో పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలు నిర్వహించాలి

ఎల్.ఎన్.పేట: ఈ నెల 16, 17, 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం బీఎల్ఓలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులైనవారు ఓటు నమోదు, ఓటర్ల జాబితాలో తప్పు, ఒప్పులను సరిచేసుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ ఎస్.గవరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

10న నేత్ర వైద్య శిబిరం

నరసన్నపేట: ఈ నెల 10వ తేదీన మండలంలోని కోమర్తి గ్రామంలో ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి అప్పలరాజు గురువారం తెలిపారు. మాజీ సర్పంచ్ శిమ్మ జగన్నాథం ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శిబిరం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామంలోని స్కూల్ ఆవరణలో శిబిరం ప్రారంభిస్తామన్నారు. వైద్యుల సలహా మేరకు కేటరాక్టు ఆపరేషన్ ఉచితంగా చేస్తామన్నారు. కంటి రోగులు వినియోగించుకోవాలని కోరారు.

15 లోగా ప్రీమియం చెల్లించాలి

ఎల్.ఎన్.పేట: వాతావరణ ఆధారిత పంటలైన పండ్లతోటలకు బీమా చెల్లించటం ఎంతో అవసరమని ఆమదావలస ఉద్యానవనశాఖ అధికారి బి.అయంతికుమారి అన్నారు. మండలంలోని కొత్తబాలేరులో గిరిజన రైతులతో గురువారం సమావేశమయ్యారు. జీడి, మామిడి, ఇతర పండ్ల తోటలకు ప్రతీరైతు ఈ నెల 15వ తేదీలోగా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పండ్ల తోటలకు నష్టం జరిగితే బీమా చెల్లించిన రైతులకు నష్ట పరిహారం అందివ్వటం జరుగుతుందన్నారు. 2024–25 రబీలో జీడి మామిడికి ఎకరానికి రూ.1,600, హెక్టార్‌కు రూ.4 వేల బీమా ప్రీమియం మీ–సేవ కేంద్రాల ద్వారా రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉద్యాన విస్తరణ అధికారి తిరుపతిరావు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ టి.విమల పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థికసాయం

కొత్తూరు: కొత్తూరుకు చెందిన భగత్‌సింగ్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు తమ ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చింతాడ లక్ష్మి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వైద్యం ఖర్చుల నిమిత్తం రూ.20 వేలను ట్రస్టు సభ్యులు గురువారం అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com